


# విభారె

తెలుగు దినపత్రిక


VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 03-09-2022 సంపుటి : 04 సంచిక : 15 పేజీలు : 4 వెల : రూ 3-00

# తొలి స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసిన మోదీ

తిరువనంతపురం: కేరళ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన తొలి బాహుబలి నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఈ విమాన వాహక నౌకను జాతికి అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కేరళ తీరంలో ఈ రోజు నవశకం ప్రారంభమైందని తెలిపారు. అమృతోత్సవ వేళ ఐఎన్ఎస్ నౌక ప్రవేశం శుభపరిణామమన్నారు. భారత్‌కు సాధ్యం కానిది ఏదీ ఉండదని, ఐఎన్ఎస్ విక్రాంత్ నౌకను చూసి ప్రతి భారతీయుడు గర్వించాలని అన్నారు.కాగా విక్రాంత్ నౌక 2023లో తూర్పు నౌకాదళ అమ్ములపొదిలో పూర్తిస్థాయిలో చేరే అవకాశముంది. ఐఎన్ఎస్ విక్రాంత్ నౌక గంటకు 28 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించనుంది. దీని తయారీకి 13 ఏళ్ల సమయం పట్టగా.. రూ.20 వేల కోట్లు ఖర్చయ్యింది. 262 మీటర్ల పొడవు.. 62 మీటర్ల వెడల్పు కలిగిన ఈ నౌక బరువు 37,500 టన్నులు. ఇందులో మొత్తం 14 అంతస్తులు, 2300 కాంపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. విధుల్లో 1600 మంది సిబ్బంది ఉంటారు. ఇప్పటిదాకా భారత్ వద్ద ఉన్న యుద్ధ నౌకలన్నీ బ్రిటన్, రష్యాల నుంచి దిగుమతి చేసుకున్నవే. అలాంటిది అగ్రదేశాలే ఆశ్చర్యపోయేలా అత్యాధునిక విమానవాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ విజయవంతంగా నిర్మించింది. ఈ సామర్థ్యమున్న అమెరికా, రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ సరసన సగర్వంగా తలెత్తుకుని నిలిచింది. 42,8000 టన్నుల సామర్థ్యంతో రెండు టేకాఫ్ రన్‌వేలు, ఒక ల్యాండింగ్ స్ట్రిప్‌లతో క్షిపణి దాడిని తట్టుకునేలా నిర్మించారు. గత ఏడాది ట్రయల్స్ విజయవంతంగా ముగిశాయి. చైనాతో ఉద్రిక్తత నెలకొన్న వేళ ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతమిస్తూ నిర్మించిన ఈ బాహుబలి యుద్ధనౌకను ప్రధాని నరేంద్ర మోదీ కొచ్చి తీరంలో నావికాదళానికి అప్పగించనున్నారు. ఈ నౌకలో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ తరహా వైద్య సదుపాయాలున్నాయి.

ఫిజియోథెరపీ క్లినిక్, ఐసీయూ, ల్యాబొరేటరీ, సీటీ స్కానర్, ఎక్స్‌రే మెషీన్లు, డెంటల్ కాంప్లెక్స్, ఐసోలేషన్ వార్డులతో కూడిన అత్యాధునిక మెడికల్ కాంప్లెక్స్ ఉంది. 16 బెడ్లు, రెండు ఆపరేషన్ థియేటర్లున్నాయి. ఐదుగురు మెడికల్ ఆఫీసర్లు, 17 మంది మెడికల్ సెయిలర్స్ ఉంటారు. ఇక దీని కిచెన్ కూడా అత్యాధునికమే. గంటలో ఏకంగా 1,000 మందికి చపాతీలు, ఇడ్లీలు తయారుచేసే ఆధునిక పరికరాలున్నాయి.

# ఆ ఘనత మన ప్రభుత్వానిదే: సీఎం జగన్



## పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం సమీక్ష

వైఎస్సార్ జిల్లా: వైఎస్సార్ జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోరోజు పర్యటన కొనసాగుతోంది. ఇడుపులపాయలో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం సమీక్ష చేపట్టారు. విడతల వారీగా సాయంత్రం వరకు పులివెందుల నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాల పై స్థానిక నాయకులు, అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ పంటల బీమా విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.3వేల కోట్లు పంటల బీమా అందించామన్నారు. ఆ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్స్ ఏజెన్సీపై సీఎం సమీక్ష నిర్వహించారు. రైతులంతా ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలపై సీఎం మాట్లాడుతూ, వైద్య, ఆరోగ్యశాఖలోనే 40వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. చక్రాయపేట మండలంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

# మహానేత వైఎస్సార్‌కు సీఎం జగన్ ఘన నివాళి

వైఎస్సార్ జిల్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లాలో రెండోరోజు పర్యటిస్తున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన నివాళులర్పించారు. సీఎంతో పాటు ఆయన కుటుంబసభ్యులు వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, వైఎస్ షర్మిల వైఎస్సార్‌కు నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్సార్‌కు నివాళి అనంతరం పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం జగన్ సమీక్ష చేపట్టారు. విడతల వారీగా సాయంత్రం వరకు పులివెందుల నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాల పై స్థానిక నాయకులు, అధికారులతో సీఎం సమీక్ష జరుపుతున్నారు.

# రాష్ట్రంలో ప్రశ్నించిన వారిని పైకి పంపుతున్నారు



## 2లక్షల కోట్లు సంపాదించిన సిఎం జగన్
## త్వరగా ఎన్నికలు వస్తే ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం
## పొత్తులపై తానెక్కడా మాట్లాడ లేదు
## టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు





అమరావతి,సెప్టెంబర్2): రాష్ట్రంలో విధ్వంస పాలన సాగుతోందని.. ప్రశ్నించిన వారిని పైకి పంపడమే ధ్యేయంగా కేసులతో వేధిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు, ఉద్యోగులు సహా అందరూ బాధ పడుతున్నా.. వైకాపా నేతల ఆస్తుల మాత్రం రెట్టింపవుతున్నాయన్నారు. జగన్ ఆస్తులు దాదాపు రూ.2 లక్షల కోట్లకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. త్వరగా ఎన్నికలు వస్తే రాష్ట్రానికి పట్టి పీడ వదిలిపోతుందని.. నెత్తిన ఉన్న కుంపటిని ఎప్పుడు దించుకుందామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. జగన్మోహన్ రెడ్డి అవినీతి రూ.2లక్షల కోట్లు దాటిపోయిందని ఆరోపించారు.తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో పొత్తులపై చంద్రబాబు స్పష్టతనిచ్చారు. రాష్ట్రం కోసం అవసరాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇప్పటివరకు పొత్తుల గురించి తానెక్కడా మాట్లాడలేదని.. పొత్తుల గురించి నాయకుల్లో స్పష్టత ఉండాలని పేర్కొన్నారు. కేంద్రం లేదా రాష్ట్రంలో రాష్ట్ర పునఃనిర్మాణం కోసం చేసే కార్యక్రమాలకే తమ ప్రాధాన్యమని తేల్చిచెప్పారు. పోలీసులు లేకుండా వస్తే వైకాపానో, తెలుగుదేశం పార్టీనో తేల్చుకునేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి జగన్‌కు సవాల్ విసిరారు. మాంతం పెరిగిన జగన్? ఆస్తులు : రాష్ట్రంలో జగన్ ఆస్తులు పెరిగి జనం జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని చంద్రబాబు మండిపడ్డారు. అవినీతిని క్రమబద్ధీకరిస్తున్నారనటానికి లేపాక్షి భూముల వ్యవహారమే ఉదాహరణ అని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో ప్రజల ఆదాయం పెరగలేదు కానీ వైకాపా నేతల ఆదాయం మాత్రం విపరీతంగా పెరిగిందని విమర్శించారు. సొంత సంస్థలకు ఇష్టానుసారం కేటాయింపులు, అనుమతులు ఇస్తున్నారని ఆక్షేపించారు. మూడున్నరేళ్ల జగన్ రెడ్డి పాలనలో విజన్ లేని విధ్వంసమే ఎక్కువని, ఒక్కో కుటుంబంపై రూ. 3.25లక్షల అదనపు ఆర్థిక భారం వేశారని మండిపడ్డారు. స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేయటంతో ఏ సర్పంచ్? ఆనందంగా లేరని వాపోయారు.క్విట్ జగన్?.. సేవ్ ఆంధ్రప్రదేశ్: ? తెలుగుదేశం పార్టీ పేరు చెప్తేనే వైకాపాలో వణుకు మొదలవుతోందని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీలో పోరాడేవారు తయారు కావాలని.. వారిని పార్టీలో ఉన్నపెద్ద మనుషులు తయారు చేయాలని సూచించారు. న్యాయబద్ధంగా, రాజకీయంగా పోరాడి రాష్టాన్ని కాపాడుకునేందుకు 'క్విట్ జగన్?.. సేవ్ ఆంధ్రప్రదేశ్' నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు

# ఏపీలో రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి: సోమిరెడ్డి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేపడుతున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతు ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. గత ఏడాదితో పోల్చితే 14.5 శాతం రైతు ఆత్మహత్యలు రాష్ట్రంలో పెరిగిపోయాయని విమర్శించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు.



ఇప్పటి వరకూ జరిగిన 8067 ఆత్మహత్యల్లో 5677 ఆత్మహత్యలు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధరంగాల వారివే అని పేర్కొన్నారు. వీటిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను వైసీపీ నాయకులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే మద్య నిషేదం అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం మద్యం దళారులతో మిలాఖతై వారితో విషపూరిత మద్యం తయారు చేయించి ప్రజలకు అందిస్తూ రూ. 5వేల కోట్ల ఆదాయం పెంచుకున్నారని మండిపడ్డారు.

# బల్క్ డ్రగ్ పార్క్ కేటాయింపులో తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి: మంత్రి కేటీఆర్

బల్క్ డ్రగ్ పార్క్ కేటాయింపులో తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి చూపిందని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణపై వివక్షతో మోదీ సర్కారు దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అంతర్జాతీయ



ప్రమాణాలతో నెలకొల్పుతున్న హైదరాబాద్ ఫార్మాసిటీ అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, మాస్టర్ ప్లానింగ్‌తో సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని కేంద్రం కావాలనే విస్మరించిందన్నారు.కొత్తగా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయాలంటే కనీసంగా మూడేళ్లు పడుతుందని తెలిపారు. అన్ని సిద్దంగా ఉన్న హైదరాబాద్ ఫార్మాసిటీని పరిగణనలోకి తీసుకుపోకపోవడం.. ఫార్మా రంగాన్ని అత్మనిర్భరత దిశగా స్వయం సమృద్ధి చేయాలన్న లక్ష్యం పట్ల కేంద్రానికి ఉన్న నిబద్ధతలేమికి నిదర్శనమని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అన్ని అనుకూలతలు, అనుమతులతో సిద్ధంగా ఉన్న హైదరాబాద్ ఫార్మాసిటీకి మొండి చెయ్యి ముమ్మాటికీ వివక్షేనని ధ్వజమెత్తారు.

# వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి

అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి కొట్టు



సత్యనారాయణ, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఎంపీ నందిగం సురేష్, మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, పలు కార్పోరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, పాలకుడు ఎలా ఉండాలో చూపిన నాయకుడు వైఎస్సార్ అని, తండ్రి స్ఫూర్తితో సీఎం జగన్ ముందుకెళుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తోందన్నారు. పేదల జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు తెచ్చారన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నామన్నారు.కాగా, మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా తన తండ్రిని తలుచుకుంటూ ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావోద్వేగ ట్వీట్ చేశారు. "నాన్న భౌతికంగా దూరమైనా నేటికీ ఆయన చిరునవ్వు, ఆ జ్ఞాపకాలు అలానే నిలిచి ఉన్నాయి. దేశచరిత్రలోనే సంక్షేమాన్ని సరికొత్తగా నిర్వచించి.. ప్రజల అవసరాలే పాలనకు ప్రధానాంశం కావాలని ఆయన చాటిచెప్పారు.

# ఇంద్రకీలాద్రిపై టీటీడీకి మించి ఏర్పాట్లు : ఏపీ మంత్రి

అమరావతి : విజయవాడలో వెలసిన దుర్గమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఇంద్ర కీలాద్రికి వచ్చే భవాని భక్తులు ఇబ్బందులు పడకుండా ఇప్పటి నుంచే ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఇవాళ ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే అన్ని మార్గాల్లో ఏర్పాట్లను సీపీ కాంతి రాణా, కలెక్టరు ఢిల్లీ రావుతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ఆలయంలో మానవ వనరుల లేకపోయినా టీటీడీకి మించిన ఏర్పాట్లను చేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ ప్రకారం 10 లెటర్స్, బ్రేక్ దర్శనానికి ఐదుగురికి అనుమతిస్తామని తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం వీఐపీలకు దర్శనం కల్పించే ఏర్పాట్లను, బ్రేక్ దర్శనాల కోసం ప్రత్యేక పోర్టల్ ను ఏర్పాటు చేస్తామన్నారు.లోకల్ ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ పరిధి పెంచుతామన్నారు.

# సంపాదకీయం

శనివారం 03-09-2022

## పెగాసిస్ కథ కంచికేనా.....

కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రత్యర్థులపైన, అలాగే జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ఎన్నికల సంఘ సభ్యులు, మానవహక్కుల కార్యకర్తలపైన నిఘాకు ఇజ్రాయిలీ గూఢచారి సాఫ్ట్‌వేర్ పెగాసస్‌ను ప్రయోగించిందా? లేదా? అన్నది సుప్రీం కోర్టు ఏర్పాటుచేసిన కమిటీ తేల్చలేకపోయింది. ఇది కమిటీ వైఫల్యం అనేదానికన్నా ప్రభుత్వమే ఆ కమిటీని విఫలమయ్యేలా చేసిందని అనడం సముచితంగా ఉంటుంది. గత ఏడాది అక్టోబరు 28న జస్టిస్ ఆర్వీ రవీంద్రన్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీ దర్యాప్తునకు ప్రభుత్వం సహకరించడానికి బదులు అడుగడుగునా అడ్డుతగిలింది. మన దేశంలో మొత్తం 300 మంది ఫోన్లపై ఈ స్పైవేర్ దాడి చేసిందనీ, అందులో పాత్రికేయులతోపాటు కేంద్రంలోని ఇద్దరు మంత్రులూ, విపక్ష నేతలు ముగ్గురూ, రాజ్యాంగ పదవిలో ఉన్న ఒకరు, వ్యాపారవేత్తలు, పౌరహక్కుల నాయకులు ఉన్నారనీ అప్పట్లో బయటికొచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం నిరుడు అక్టోబర్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన కమిటీ పరిశీలనకు 29 మంది తమ ఫోన్‌లు అందజేయగా అందులో అయిదు ఫోన్లలో మాల్‌వేర్ ఉన్నట్టు గుర్తించారు. అది పెగసస్ సాఫ్ట్‌వేరా కాదా అన్నది కమిటీ తేల్చలేకపోయిందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. నిపుణుల కమిటీ నివేదిక, పర్యవేక్షించిన మాజీ న్యాయమూర్తి నివేదిక సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో ఉంచబోతోంది. ఆ తర్వాతగానీ ఈ విచారణ లోతుపాతులు తెలియవు. ఇజ్రాయెల్ సంస్థ ఎన్ఎస్ఓ రూపొందించిన పెగసస్ గురించి నిరుడు వెల్లడైనప్పుడు ప్రపంచ దేశాల ప్రజానీకమంతా నివ్వెర పోయింది. పలు ప్రభుత్వాలు ఈ సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి తమ కంట్లో నలుసుగా మారినవారిపై నిఘా పెట్టాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ స్పైవేర్‌ను మన ప్రభుత్వం 2017లో కొనుగోలు చేసిందని మొన్న జనవరిలో 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక వెల్లడించింది. ఇజ్రాయెల్‌తో రక్షణ కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందంలో భాగంగానే ఇది జరిగినట్టు ఆ పత్రిక కథనం. ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి చంద్రబాబు సర్కారు ఈ స్పైవేర్‌ను కొన్న దని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించి సంచలనం సృష్టించారు. ఇలా ఇంటా బయటా అందరూ కోడై కూస్తున్నా కేంద్రం నోరు మెదపలేదు. పార్లమెంటులో అలజడి రేగినా, నిరుడు వర్షాకాల సమావేశాలు ఈ అంశంపైనే తుడిచిపెట్టుకుపోయినా 'భద్రతా కారణాల రీత్యా' ఏమీ చెప్పలేమన్న గంభీరమైన ప్రత్యుత్తరంతో సరిపెట్టింది. సర్వోన్నత న్యాయస్థానంలోనూ అదే వైఖరి తీసుకుంది. ఇక చంద్రబాబు సంగతి చెప్పనవసరం లేదు. ఆయన మొదటినుంచీ దబాయింపుతో నెట్టుకొస్తున్నారు. మన స్వాతంత్ర్యోద్యమం ప్రజాజీవితంలోకి ఎన్నో కొత్త విలువలను మోసుకొచ్చింది. అట్టడుగు పౌరులకు సైతం ప్రజాస్వామ్య ఫలాలు అందాలన్న ఆకాంక్షతో ఆ విలువల ప్రాతిపదికనే మన రాజ్యాంగాన్ని రూపొందించారు. దేశంలో ప్రజాస్వామ్యం ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొంటున్నా, సమస్యలెన్ని ఎదురవుతున్నా అవన్నీ సంపూర్ణ రిపబ్లిక్ ఆవిర్భావానికి దేశం పడుతున్న పురుటి నొప్పులుగా మొదట్లో అందరూ భావించారు. కానీ రాను రాను ప్రజాస్వామ్యాన్ని ఛిద్రం చేస్తున్నవారిదే పైచేయి అవుతున్న వైనం కనబడుతూనే ఉంది. ఈ పరిణామాలే చివరకు పెగసస్ వంటి స్పైవేర్ కొనుగోలుకు దారితీసినట్టు భావించాలి. పెగసస్ గురించి అధికారికంగా ఆధారాలేవీ బయటపడకపోయినా భీమా కోరెగావ్ కేసులో ఇరుక్కున్న ఒకరిద్దరి కార్యకర్తల లు, కంప్యూ టర్లలో అవాంఛనీయమైన సాఫ్ట్‌వేర్ చొరబడటంలో ఆ సాఫ్ట్‌వేర్ పాత్ర ఉందన్న సంగతి వెల్లడైంది. తమ స్పైవేర్‌ను 'బాధ్యతాయుత ప్రభుత్వాలకు' విక్రయించాం తప్ప ప్రైవేటు వ్యక్తులెవరికీ అంద జేయలేదని ఎన్ఎస్ఓ స్పష్టంగా చెబుతోంది.ఆ 'బాధ్యతాయుత' ప్రభుత్వాల జాబితా అది బయట పెట్టకపోయినా, వ్యక్తులెవరికీ ఆ సంస్థ విక్రయించలేదన్న సంగతైతే మీడియా సంస్థల అంతర్జాతీయ కన్సార్షియం దర్యాప్తులో తేటతెల్లమైంది. పైగా ధర రీత్యా ఆ సాఫ్ట్‌వేర్ బడా కోటీశ్వరులకు తప్ప అందుబాటులో ఉండే అవకాశం లేదు. ఇటు కేంద్రం నడత సందేహాలను నివృత్తి చేయకపోగా మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. గూఢచర్యం విషయంలో తనపై వచ్చిన ఆరోపణలను కేంద్రం ఖండిస్తున్న మాట నిజమే అయినా... రాజ్యాంగ పదవిలో ఉన్నవారిపై, కేంద్రమంత్రులపై నిఘా కొనసాగిందన్న అంశంలో అది నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోవడం వింత కాదా? ప్రభుత్వ సంస్థలేవీ ఆ స్పైవేర్‌ను వినియోగించలేదని ప్రకటిస్తున్న ప్రభుత్వం, తామే కాదు... వేరెవరూ కూడా ఆ పని చేయలేదని నిర్ద్వంద్వంగా ఎందుకు చెప్పలేకపోతోంది? కనీసం ఆ విషయంలో దర్యాప్తు చేశామనీ, ఫలానా అంశాలు వెల్లడయ్యాయనీ ఎందుకు వివరించడం లేదు? బహిరంగ అఫిడ విట్‌లో వివరాలు పొందుపరచడం సాధ్యపడదనీ, నిపుణుల కమిటీ నియామకానికి తనను అను మతిస్తే ఆ కమిటీకి నివేదిస్తాననీ నిరుడు కేంద్రం చేసిన వినతిని సుప్రీంకోర్టు అంగీకరించలేదు. తానే కమిటీ ఏర్పాటుచేసింది. దానికైనా కేంద్రం వివరాలందజేస్తే బాగుండేది. ఆ పని చేయకపోవడం వల్ల కమిటీ నివేదిక కొత్తగా ఏమీ చెప్పలేకపోయింది.దేశం మొత్తాన్ని కుదిపేసిన పెగసస్ వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం ముందు కేంద్ర ప్రభుత్వం నీళ్లు నమలడం, దాటేయడం ఎవరి సలహా పర్యవసానమో గానీ ఈ వైఖరి దాని ప్రతిష్ఠను ఏమాత్రం పెంచదు. దేశ పౌరులనుంచి చట్టబద్ధ ప్రవర్తనను ఆశించే ప్రభుత్వాలూ, చట్ట ఉల్లంఘనకు పాల్పడే పౌరులపై చర్యలు తీసుకునేందుకు సర్వాధికారాలు ఉన్న ప్రభుత్వాలూ రాజ్యాంగ నైతికతకు కట్టుబడి ఉండాలి. ఆదర్శవంతంగా మెలగాలి. రాజ్యమే రాజ్యాంగ ఉల్లంఘ నకు పాల్పడుతుంటే, అది రివాజుగా మారితే ఆ సమాజాన్ని కాపాడటం ఎవరి తరమూ కాదు

# గుంటూరు వైసీపీలో భారీ మార్పులు

గుంటూరు, సెప్టెంబర్ 2, గుంటూరు వైసీపీలో భారీ మార్పులు జరగబోతున్నాయా? వచ్చే ఎన్నికల నాటికి ఎమ్మెల్యేలకు స్థాన చలనం కలగనుందా? సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి అంబటి మరో నియోజకవర్గం చూసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయా? అనే చర్చ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జోరుగా సాగుతోంది. వైసీపీలోకి మంగళగిరి బీసీ నేతల చేరికలతో కొత్త సమీకరణలు తెరమీదకొస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో మంత్రి అంబటి రాంబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న సత్తెనపల్లి సీటును ఆర్కేకు కేటాయించనున్నారన్న ప్రచారం ఊపందుకుంది. చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేష్‌పై సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామక్రిష్ణా రెడ్డిని గెలిపిస్తే మంత్రిని చేస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్ గతంలో మాటిచ్చారు. అయితే అప్పటికే మంగళగిరిలో కీలక నేతలుగా ఉన్న మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలను చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించి చక్రం తిప్పారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రధాన నియోజకవర్గంగా ఉన్న మంగళగిరి సీటును ఎలాగైనా దక్కించుకోవాలని టీడీపీ అధినేత పావులు కదిపారు. పార్టీలో చేరిన నేతలు వియ్యంకులే కావడంతో తమకే టిక్కెట్ దక్కుతుందని భావించారు. అందరు నేతలను పార్టీలోకి చేర్చుకున్న తర్వాత అనూహ్యంగా లోకేష్‌ను రంగంలోకి దింపడంతో నేతలు అసహనానికి గురయ్యారు. టిక్కెట్ ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ కాండ్రు కమల బాహాటంగానే విమర్శలు గుప్పించారు కూడా. గత ఎన్నికల్లో నారా లోకేష్ ఓటమితో నేతలు సహకరించలేదన్న వాదనలు వినిపించాయి. తదనంతరం మాజీ మంత్రి హనుమంతరావు సహా కాండ్రు కమల కూడా



వైసీపీలో చేరిపోయారు. గత ఎన్నికల వేళ వైసీపీ నేతలతో అంతర్గత ఒప్పందం జరిగిందన్న ప్రచారం కూడా సాగింది. నారా లోకేష్‌పై గెలుపునకు సహకరిస్తే వచ్చే ఎన్నికల్లో మంగళగిరిలో కీలకమైన చేనేత వర్గానికే పార్టీ టిక్కెట్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు చర్చ నడిచింది. ఎట్టకేలకు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్కే చంద్రబాబు తనయుడిపై ఘన విజయం సాధించి తీవ్ర పరాభవం రుచిచూపించారు. ఇప్పుడు తాజాగా జరుగుతున్న పరిణామాలు కూడా గతంలో ప్రచారంలోకి వచ్చిన వాదనలకు బలం చేకూర్చేలా ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2014లో మంగళగిరి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఆర్కే చేతిలో ఓటమిపాలైన గంజి చిరంజీవి వైసీపీలో చేరడం కొత్త చర్చకు తెరలేపింది. 2014లో చిరంజీవి ఓడిపోయినప్పటికీ ఆయనే టీడీపీ ఇన్‌చార్జిగా.. మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగారు. పార్టీలో కీలక నేతగా చక్రం తిప్పారు. నారా లోకేష్‌కు సైతం అండగా నిలిచారు. టీడీపీ కీలక నేతగా ఉన్న ఆయన ఇటీవల వైసీపీ కండువా కప్పుకోవడంతో మంగళగిరి సీటు చేనేత వర్గానికి కేటాయించడం దాదాపు ఖరారైపోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే అక్కడి నుంచి రెండు సార్లు గెలిచిన ఆర్కే సత్తెనపల్లి నుంచి బరిలోకి దిగుతారన్న ప్రచారం సాగుతోంది. ఇటీవల సీఎం జగన్ చేయించిన సర్వేలోనూ అభ్యర్థులను మార్చాల్సిన అవసరముందన్న నియోజకవర్గాల్లో సత్తెనపల్లి, మంగళగిరి కూడా ఉన్నట్లు చెబుతున్నారు. మంగళగిరిలో బీసీ నేతల చేరికలతో ఆర్కేకు స్థాన చలనం తప్పేలా కనిపించడం లేదు. దీంతో ఆయన సత్తెనపల్లి నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు స్థానిక నేతలు చెప్పుకుంటున్నారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అంబటి రాంబాబు మరో నియోజకవర్గానికి మారతారని చెబుతున్నారు. క్రిష్ణా జిల్లా అవనిగడ్డ నుంచి అంబటి బరిలోకి దిగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ఆర్కే సత్తెనపల్లి సీటును ఆశించి భంగపడ్డారు. 2009 ఎన్నికల్లో సీటు కోసం తీవ్రంగా శ్రమించారన్న ప్రచారం కూడా ఉంది. అయితే ఆ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర్ రెడ్డికే టిక్కెట్ దక్కడంతో ఆర్కే సైలెంట్ అయిపోయారు. నియోజకవర్గంలో ఆయనకు బంధువర్గం, స్నేహితులు ఉండడంతో సత్తెనపల్లి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని చెబుతున్నారు. వర్గవిభేదాలతో టీడీపీ కూడా అంత బలంగా లేకపోవడం కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. మరి సీఎం జగన్ ఏం చేస్తారో వేచిచూడాలి మరి!!

# ఏపీలో 26 ప్రాంతాల్లో రోప్ వే ఏర్పాటు

విజయవాడ, సెప్టెంబర్ 2,ఏపీకి రోప్ వే హంగులు రానున్నాయా? పర్యాటక ప్రాంతాలు కొత్త రూపు సంతరించుకోనున్నాయా? అంటే అవుననే అంటున్నారు అధికారులు. ఏపీలో పర్యాటకుల ద్వారా మరింత ఆదాయం సమకూర్చుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 26 టూరిస్ట్ ప్రాంతాల్లో రోప్‌వే వేసేందుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. పర్వతమాల ప్రాజెక్టులో భాగంగా రోప్ వేల ఏర్పాటు చేయనుంది. విజయవాడ కనకదుర్గమ్మ కొండపైకి, కృష్ణా నది మీదుగా ఈగలపెంట నుంచి శ్రీశైలం వరకు రోప్ వే ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం అయిందని తెలుస్తోంది.మరో ఆరు చోట్ల డీపీఆర్‌ల తయారీకి ముమ్మర కసరత్తు చేస్తోంది పర్యాటక శాఖ. ఇప్పటికే నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది ఏపీటీడీసీ. మూడు నాలుగు నెలల్లో కార్యరూపం దాల్చే అవకాశం వుందని అంటున్నారు పర్యాటక శాఖ అధికారులు. రోప్ వేల నిర్వహణ బాధ్యతను నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ చేపట్టనుంది.ఏపీకి రోప్‌వే హంగులు రాబోతున్నాయి. కేంద్ర పథకం పర్వత మాల పథకంలో భాగంగా ఏపీలో మొత్తంగా 26 ప్రాంతాల్లో రోప్ వే ఏర్పాటు చేయడానికి కసరత్తు ముమ్మరంగా చేస్తున్నారు అధికారులు. విజయవాడ కనకదుర్గమ్మ కొండ ఇంద్రకీలాద్రి పైకి రోప్ వే ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే డీపీఆర్ సిద్దమైంది.ఏపీలో అతి తక్కువ ప్రదేశాల్లో మాత్రమే రోప్‌వే అందుబాటులో ఉంది. ప్రస్తుతం శ్రీశైలం, విశాఖ కైలాసగిరి వంటి ప్రాంతాల్లో తప్ప.. మిగిలిన చోట్ల ఎక్కడ రోప్ వే లేదు. అయితే ఆ కొరత తీర్చేందుకు.. పైనుంచి ప్రకృతి అందాలను చూసి పులకరించేందుకు ఏపీలో భారీ ఎత్తున రోప్‌వేలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్దమవుతోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 26 చోట్ల రోప్‌వేలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పర్వత మాల ప్రాజెక్టులో భాగంగా ఏపీకి రోప్ వే హంగులను అద్దేందుకు సిద్దమవుతున్నారు అధికారులు.ఏపీలో మొత్తంగా 26 పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో రోప్ వేలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. ఎన్‌హెచ్‌ఏఐకు అనుబంధ సంస్థ అయిన నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ అనే సంస్థతో ఏపీటీడీసీ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. దీంట్లో భాగంగా ఇప్పటికే రెండు చోట్ల డీపీఆర్‌లు కూడా సిద్దంగా ఉన్నట్టు సమాచారం.

ఇంద్రకీలాద్రి పైకి రోప్‌వే ఏర్పాటు.. అలాగే తెలంగాణ ప్రాంతంలోని ఈగల పెంట నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నది మీదుగా రోప్ వే ఏర్పాటుకు డీపీఆర్‌లు సిద్దంగా ఉన్నాయి. ఇవి కాకుండా.. మరో ఆరు చోట్ల వీలైనంత త్వరగా డీపీఆర్‌లు సిద్దం చేసేందుకు కసరత్తు ముమ్మరం చేశారు అధికారులు. గండికోట, శ్రీకాళహస్తి, కటికి వాటర్ ఫాల్స్, లంబసింగి, అన్నవరం, గగన్‌మహల్–పెనుకొండ పర్యాటక ప్రదేశాల్లో రోప్ వే ఏర్పాటుకు త్వరలోనే డీపీఆర్‌లు సిద్దం కానున్నట్టు సమాచారం.వీటిల్లో వీలైనంత త్వరగా రోప్‌వేల ఏర్పాటు పూర్తి చేయాలని భావిస్తున్నారు అధికారులు. వీలుంటే మరో మూడు నాలుగు నెలల్లో కార్యరూపం దాల్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రోప్‌వేల నిర్వహణ బాధ్యతను పూర్తిగా నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సంస్థే చేపట్టనుంది. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా సదురు సంస్థే తీసుకోనున్నట్టు సమాచారం. అనుకున్న విధంగా రోప్‌వే హంగులు ఏపీకి వస్తే.. ఏపీని న్యూలుక్‌లో చూడొచ్చని పర్యాటకులు ఉవ్విళ్లూరుతున్నారు.

## విలీన మండలాలను వణికిస్తున్న జ్వరాలు




రాజమండ్రి, సెప్టెంబర్ 2 భారీవర్షాలు కురిశాయి? గోదావరికి వరదలు వచ్చి విలీన మండలాల వాసులు వరద నీటిలో కొంతకాలం పాటు జీవనం సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. వరదల వల్ల ఇళ్ళలో మట్టి, బురద నిండిపోయింది. దీంతో దోమల బెడద జనాన్ని ఇబ్బంది పెట్టింది. తాజాగా అల్లూరి జిల్లా విలీన మండలాల ప్రజలు విషజ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతూరు మండలం కుయుగూరు గ్రామానికి చెందిన కారం సంధ్య అనే పదేళ్ల బాలిక జ్వరం కారణంగా మృతి చెందింది.దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇటీవల సంభవించిన వరదలు విలీన మండలాల్లో సుమారు 45 రోజుల పాటు నిలిచి తగ్గిన తర్వాత ఇక్కడి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. తాజాగా కుయుగూరు గ్రామానికి చెందిన సంధ్య అనే బాలిక జ్వరంతో బాధ పడుతూ మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఈ బాలిక గత నెల 27 వ తేదీన సి.ఎం.జగన్ కుయుగూరు వచ్చినప్పుడు పూర్తిగా ఆయనతోనే ఉంది. సి.ఎం.సంధ్యని పిలిచి మరీ తనతోనే ఉంచుకోవడం విశేషం. అయితే ఈ ప్రాంతంలో జ్వరాలు దయనీయమైన పరిస్థితులను నెలకొల్పుతున్నాయని, దీనికి కారణం సకాలంలో సరైన వైద్యం అందకపోవడమే అని పలువురు ఆరోపిస్తున్నారు.ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో మందులు లేకపోవడంపై జనం మండిపడుతున్నారు. దీంతో పాటు వైద్యుల కొరత కూడా ఇందుకు కారణం అని అంటున్నారు. వెంటనే వెంటనే విలీన మండలాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఈ ప్రాంత ప్రజలు,నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విషజ్వరాలను తేలికగా తీసుకుంటే తర్వాత అనేక ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు.మారుతున్న వాతావరణం పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తక్షణ ప్రభావం చూపుతుంది. వేడినీటిని తాగడం, బయట ఆహార పదార్థాలు తినకుండా వుండడం చేయాలంటున్నారు. ఎడతెగకుండా జ్వరం బాధిస్తుంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్లి బ్లడ్ టెస్ట్ చేయించుకోవాలి

# నాటు కోడికి భలే..భలే...



కర్నూలు, సెప్టెంబర్ 2, నాటుకోడి అంటే మాంసం ప్రియులకు నోరూరుతుంది. బ్రాయిలర్ చికెన్ ధరకు రెట్టింపు, మటన్‌తో సమానంగా ధర పలుకుతున్నా కొనుగోలుకు వెనుకాడటం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాటి మాంసానికి ఉన్న ఆదరణ చూసి కొందరు దుకాణదారులు, హోటల్ నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. వాటిని పోలిన జాతులను చూపిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాటో.. కాదో నిర్ధారించుకోవడం కొంత కష్టంగా ఉన్నా, తరచి చూస్తే ఇలాంటి మోసాలకు తెరదించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.గ్రామాల్లో దేశవాళీ నాటుకోడి పెరిగేందుకు ఎక్కువ కాలం పడుతుంది. ఆరు వారాలకు 400 గ్రాముల బరువు పెరుగుతుంది. వంద రోజులు దాటితే 1.5 కిలోలకు ఎదుగుతాయి. అదే వనరాజ, గిరిరాజ కోళు ఆరు వారాల్లోనే 850 గ్రాముల పైన, బ్రాయిలర్ 1.50 కిలోల వరకు పెరుగుతుంది. ఫారంలో లైట్ల వెలుగులో నిద్రపోకుండా చేసి, మొక్కజొన్న, జొన్న, శనగచెక్క వంటి బలమైన ఆహారాన్ని అందిస్తూ వేగంగా పెరిగేలా చేస్తున్నారు. వాటినే మార్కెట్లో నాటుకోళ్లుగా విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరుబయట తిరిగే దేశవాళీ కోళ్లు పురుగులు, ఆకులు, గడ్డి ఇతర విత్తనాలు వంటివి తిని బలిష్టంగా ఉంటాయి.కోళ్ల మాంసంలో నాటు కోడి రుచేవేరు. ఆ మాంసం ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వైద్యులు చెపుతారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరిగే కోళ్లలో అనేక రకాలు ఉన్నాయి. ఇలాంటి దేశవాళీతో పాటు షెడ్లలో వేగంగా పెరిగే వనరాజ, గిరిరాజ, కడక్‌నాథ్ వంటివి ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. వీటినీ నాటుకోడి మాంసమని చెప్పి విక్రయిస్తూ మోసగిస్తున్నారు. నాటుకోడి విక్రేతలు ధరలో ఎక్కడా రాజీపడరు. కిలో రూ.350 నుంచి రూ.400కు తక్కువ ఇవ్వలేరు. షెడ్లలో పెంచే కడక్‌నాథ్, గిరిరాజ ఇతర జాతుల కోళ్లు రూ.300లోపే లభ్యమవుతాయి.ఉమ్మడి జిల్లాలో రోజూ ఒకటిన్నర టన్ను వరకు విక్రయాలు జరుగుతుంటాయని, ఒక్క అనంతపురం జిల్లాలోనే టన్ను వరకు అమ్మకాలు జరుగుతాయని పశు సంవర్ధక శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ద్వారా తెలిసింది. సాధారణంగా చాలామంది ఆదివారం మాంసం తినేందుకు ఇష్టపడతారు. పట్టణం, పల్లె ఏదైనా సరే ప్రస్తుతం అందరి చూపు నాటు కోడి వైపు మళ్లడంతో విక్రయదారులు సైతం ధరలు పెంచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.వ్యవసాయం కలిసిరాకపోవడంతో ప్రత్యామ్నాయంగా నాటుకోళ్ల పెంపకం ఎంచుకున్నాను. మూడేళ్ల క్రితం 100 కోళ్ల పెంపకంతో మొదలు పెట్టాను. ప్రస్తుతం 300 కోళ్లకు ఫారం సామర్థ్యం పెరిగింది. ఇప్పటికే 200 కోళ్లు అమ్మేశాను. మోసం లేకుండా నాణ్యమైన దేశవాళీ బ్రీడ్ కోళ్లు మాత్రమే అమ్మడంతో గిరాకీ బాగా పెరిగింది. ఫారం వద్ద అయితే కిలో రూ.350 నుంచి రూ.400కు కొనుగోలు చేస్తున్నారు. ఇదే కోడి బయట మార్కెట్లో రూ.500కు పైగా అమ్ముడుపోతున్నాయి. పెట్టుబడి పోనూ రూ.40 వేలకు పైగా లాభం చేకూరుతోంది

గుర్తించడం ఇలా..

నాటుకోడి కాళ్లు, ఎముకలు బలిష్టంగా ఉంటాయి. ఎక్కువ సమయం బయట నిల్వ ఉంచినా మాంసం పాడవ్వదు.

వండిన తర్వాత ఎముకలు నమిలేందుకు గట్టిగా ఉంటాయి.

మటన్‌తో సమానంగా ఉడికించాల్సి వస్తుంది.

గిరిరాజ, వనరాజ, కడక్‌నాథ్ కోళ్లు సాధారణంగా ఒకే రంగులో జుట్టు కలిగి ఉంటాయి. ఎముకలు పలుచగా, ఈకలు ఎక్కువగా ఉంటాయి.

బ్రాయిలర్ మాంసం కూడా తక్కువ సమయంలోనే ఉడికించవచ్చు.

# ఏపీపై కాంగ్రెస్ కు ఫ్యూచర్ ఏంటీ

విజయవాడ సెప్టెంబర్ 2, ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీని ఆ పార్టీ అధినాయకత్వం పట్టించుకోవడం లేదు. అసలు ఏపీలో ఆ పార్టీ ఉన్నదన్న స్పృహ కూడా హైకమాండ్ లో కన్పించడం లేదు. అందుకే ఏ విషయాల్లోనూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ మ్యాప్ లో అసలు ఆంధ్రప్రదేశ్ ఉన్నట్లు కన్పించలేదు. కొంతకాలం క్రితం ఏపీ పై దృష్టి పెడతారని ప్రచారం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుని చర్చలు కూడా జరిపింది. ఇది జరిగి దాదాపు ఏడాది కావస్తుంది. ఆ తర్వాత మళ్లీ ఏపీ ఊసే టెన్ జన్ పథ్ నుంచి విన్పించడం లేదు.ఒకానొక దశలో ప్రస్తుతం ఉన్న పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ ను కూడా తప్పిస్తారని ప్రచారం జరిగింది. రెడ్డి సామాజికవర్గం నేతలకు పీసీసీ బాధ్యతలను అప్పగించాలని అధిష్టానం యోచించిందన్న వార్తలు వచ్చాయి. కానీ ఇంత వరకూ పీసీసీ చీఫ్ ను మార్చలేదు. ఏపీలో వైసీ?పీ, టీడీపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ఆ రెండింటి మధ్య బీజేపీ, జనసేన పార్టీలు తంటాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కు అసలు ఏపీలో సీన్ లేదు. రాష్ట్ర విభజన తర్వాత ఆ పార్టీకి ప్రత్యేకమైన ఓటు బ్యాంకు అంటూ లేకుండా పోయింది. గత రెండు ఎన్నికల్లోనూ ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. లెఫ్ట్ పార్టీలతో పోటీ పడుతూ... వామపక్ష పార్టీలతో కాంగ్రెస్ పార్టీ పోటీ పడుతుంది. పోనీ ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకోవాలన్నా ఎవరూ దరి చేయరని పరిస్థితి. సో సోలోగానే కాంగ్రెస్ పోటీ చేయాల్సి ఉంటుంది. ఒంటరిగా పోటీ చేసేందుకు కనీసం అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి. దేశంలోనే అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ కొద్దో గొప్పో బలంగా ఉన్న రాష్ట్రాల్లో బలోపేతం కావాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణ పై ఎక్కువ ఫోకస్ పెట్టినా పెద్దగా ప్రయోజనం లేదు. నేతల మధ్య వైషమ్యాలతో ఆ పార్టీ ఎదగలేక పోతుంది. ఏపీలో



మాత్రం నేతలు, ఓట్లు లేకపోవడంతో పూర్తిగా పక్కన పెట్టేసినట్లే కనపడుతుంది. కొందరు సీనియర్ నేతలున్నా వారు రాజకీయంగా సన్యాసం తీసుకున్నట్లే కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా వారు సాహిసించే పరిస్థితి లేదు. రాజకీయాలపై కొంత ఆశ ఉన్నవారు ఇప్పటికే కాంగ్రెస్ నుంచి పక్కకు తప్పుకున్నారు. మిగిలిన ఉన్న కొద్దిమంది పైకి చెప్పకపోయినా రాజకీయంగా రిటైర్మెంట్ అయినట్లే భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఏపీలో బలపడే అవకాశాలు కన్పించడం లేదు. అందుకే అక్కడ పార్టీ ఒకటి ఉందన్న విషయాన్ని కూడా మర్చి పోయినట్లున్నారు. ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఉమెన్ చాందీ ఏపీకి వచ్చే నెలలు గడుస్తుంది. ఇది చాలదూ ఏపీలో పార్టీపై ఏమేరకు ఫోకస్ పెడుతుందో అర్థం చేసుకోవడానికి?

# కాంటూరులో మారుతున్న లెక్కలు

రాజమండ్రి, సెప్టెంబర్ 2,అధికారులు రూపొందించిన గణాంకాల ప్రకారం పోలవరం ప్రాజెక్టులో 41.15 మీటర్లకు నీటిని నిలువ చేస్తే 54 గ్రామాలు ముంపునకు గురికావాలి. కానీ, తాజా గోదావరి వరదల్లో జరిగింది వేరు. విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అనేక గ్రామాలు నీటమునిగాయి. ఇది దాదాపుగా 45.72 మీటర్ల నీటి నిలువతో సమానం ! అధికారుల లెక్కలకు ఏ మాత్రం పొంతన లేని ఈ పరిస్థితే పోలవరం ముంపు గ్రామాల్లో భయానక పరిస్థితిని సృష్టిస్తోంది. వరద తగ్గినా అన్ని గ్రామాల్లో ఈ విషయమై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. వరుసగా రెండు సార్లు వచ్చిన వచ్చిన వరదతో అధికారులు రూపొందించిన కాంటూరు లెక్కలు తప్పుల తడికని తేలింది. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా ఈ లెక్కలు రూపొందించిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ముంపు లెక్కలు మరోసారి తీయాలన్న డిమాండ్ స్థానికంగా వినిపిస్తోంది. స్థానికులకు వరద తీవ్రత పై సాధారణంగా అంచనా ఉంటుంది. భద్రాచలం వద్ద వరద తీవ్రతను బట్టి ఇక్కడి గ్రామాల ప్రజలు అంచనాకు వస్తారు. దానికనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటారు. అయితే, కాఫర్ డ్యాం నిర్మాణంతో ఈ పరిస్థితి మారింది. బ్యాక్ వాటర్‌పై అంచనా లేకపోవడంతో స్థానికులు ముంపు తీవ్రతపై అంచనాకు రాలేకపోతున్నారు. అధికారులు రూపొందించిన ముంపు లెక్కలే ప్రస్తుతానికి ఆధారంగా మారాయి. 45.72 మీటర్ల మేర ప్రాజెక్టులో నీటిని నిలువ చేస్తే ఉమ్మడి పశ్చిమగోదావరిలో 57 గ్రామాలు, ఉమ్మడి తూర్పుగోదావరిలో 165 గ్రామాలు కలిపి మొత్తం 222 గ్రామాలు ముంపునకు గురవుతాయని అంచనా వేశారు. దీని ఆధారంగానే తొలి విడత వరదలో చివరిక్షణం వరకు ప్రజలను అప్రమత్తం చేయలేకపోయారు. అదే సమయంలో 41.15 మీటర్ల ఎత్తుకు చేరిన వరద నీరే ఈ గ్రామాలన్నింటిని ముంచివేసింది. వేలాది కుటుంబాలకు ఆస్తినష్టాన్ని మిగిల్చింది. దీంతో పూర్తిస్థాయిలో నీటిని నిలువ ఉంచితే పరిస్థితి ఏమిటని ఈ గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి ప్రభుత్వం నుండిగానీ, అధికారయంత్రాంగం నుండి గానీ జవాబు రావడం లేదు. 1986లో వచ్చిన వరదలకు భద్రాచలంలో 74 అడుగుల నీటిమట్టం నమోదైందని, తాజా వరదలకు 71 అడుగుల వరకే వరద చేరిందని, అయినా అప్పట్లో ముంపునకు గురి కాని జనావాసాలు సైతం తాజా వరదలకు మునిగిపోయాయని స్థానికులు చెబుతున్నారు. వరద నుండి స్థానికుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలు సైతం ముంపునకు గురయ్యాయి అధికారుల గణాంకాల ప్రకారం ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 194 టిఎంసిలు. మొదటి దశ 41.15 మీటర్లు పూర్తయితే 120 టిఎంసిల నీటి నిల్వకు అవకాశముంటుంది. గత జులై 11న పోలవరం అప్పర్ స్పిల్ వే వద్ద 38.12 మీటర్లు, ఈ నెల 11న 36.02 మీటర్ల చొప్పున గరిష్టంగా వరద నమోదైంది.ప్రస్తుత వైసిపి ప్రభుత్వంతోపాటు గత టిడిపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై చూపించిన శ్రద్ధ నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించడంలో చూపలేదు. ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న పోలవరం, దేవీపట్నం మండలాల ప్రజలను బలవంతంగా తరలించి అడ్డుతొలగించుకున్నాయి. పొమ్మనకుండా పొగపెట్టిన చందంగా కాఫర్ డ్యాం పూర్తి చేయడంతో వరదల నేపథ్యంలో ఎనిమిది మండలాలు ముంపునకు గురవుతున్నాయి. పోలవరం జాతీయ ప్రాజెక్టు కావడంతో పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయాల్సిన బిజెపి ప్రభుత్వం... నిర్మాణం మాత్రమే తమ బాధ్యత అంటూ పునరావాస కల్పన తనకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తోంది. దీన్ని ప్రశ్నించాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 41.15 మీటర్ల కాంటూరు పరిధిలో 21 వేల కుటుంబాలకు 3,473 కోట్ల రూపాయల మేర సాయం అందించేందుకు చేసిన ప్రకటన ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆచరణకు నోచుకోలేదు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిత్తూరు కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన ధ్వజస్తంభం పై మూషిక పటాన్ని ఎగురవేసి ధ్వజారోహణం నిర్వహించి స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారూ ఈరోజు సిద్ధి బుద్ధి సమేతంగా హంసవాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు... ఈ కార్యక్రమానికి కాణిపాకం,ఆగరంపల్లి, వడ్రంపల్లి,తిరువనంపల్లి కారకం పల్లి గ్రామానికి చెందిన శిర్ కరునిక వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సురేష్ బాబు,ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి,అధికారులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు...

## గ్యాస్ సిలిండర్ లారీకి మంటలు?డ్రైవర్ సురక్షితం

### లారీ దగ్ధం?ఇళ్లను ఖాళీ చేయించిన పోలీసులు

ప్రకాశంప్రకాశం జిల్లా కొమరోలు మండలం పెద్దవాడ వద్ద కర్నూలు నుంచి ఉలవపాడుకు గ్యాస్ సిలిండర్ లోడ్తో వెళ్తున్న లారీ ఇంజిన్లో మంటలు చేలరేగాయి. గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఘటనలో డ్రైవర్ సురక్షితంగా తప్పించుకున్నాడు.నిండుగా ఉన్న గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న లారీలో మంటలు చెలరేగాయి. లారీలో 300కి పైగా సిలిండర్లు ఉండగా.. వాటిలో 100కిపైగా పేలాయి. దీంతో లారీ పూర్తిగా దగ్ధమైంది.కర్నూలు నుంచి నెల్లూరు జిల్లా ఉలవపాడుకు భారత్ గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న లారీ క్యాబిన్లో మంటలు వచ్చాయి. గమనించిన వెంటనే డ్రైవర్ మోహన్రాజు లారీ ఆపి కిందికి దిగి తప్పించుకున్నారు. మంటల్లో ఉన్నవి నిండు గ్యాస్ సిలిండర్లు కావడంతో జాతీయ రహదారిపై ఇరు వైపులా అర కి.మీ. దూరంలో వాహనాలు నిలిపివేశారు. కొంచెం సేపటికి సిలిండర్లు పేలడం ప్రారంభం కావడంతో పోలీసులు అప్రమత్తమై అటువైపు ఎవరినీ వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.మంటల వేడికి సిలిండర్లు పేలడంతో అప్రమత్తమైన హైవే పోలీసులు ప్రమాద స్థలానికి 300 మీటర్ల దూరంలో ఉన్న దద్దవాడలో సుమారు 30 ఇళ్లను ఖాళీ చేయించారు. ప్రమాద స్థలానికి అగ్నిమాపక వాహనం వెళ్లినప్పటికీ సిలిండర్లు పేలుతుండటంతో 200 మీటర్ల దూరం నుంచే మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. గ్యాస్ లారీలో సిలిండర్లు భారీగా పేలడంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్రబయాందోళనకు గురయ్యారు. అటువైపు రాకపోకలను నిలిపేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

## విశాఖ కేంద్రంగా యుద్ధనౌకలు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 2, నౌకాదళ ఆయుధ పరీక్షలకు విశాఖ కేంద్ర బిందువుగా మారనుంది. ప్రధానంగా సముద్రంలో జరిగే యుద్ధాల్లో వినియోగించే ఆయుధాల పరీక్షా కేంద్రాన్ని రక్షణ శాఖ నెలకొల్పుతోంది. ఇలాంటి కేంద్రం దేశంలో విశాఖలోనే ఏర్పాటు కానుండటం గమనార్హం. అలాగే క్షిపణులు, రాకెట్ల పరీక్షా కేంద్రం కూడా ఇక్కడ నిర్మితమవుతోంది. భారీ టార్పెడోల పరీక్షలకూ ఈ కేంద్రాన్ని వినియోగించుకునే వీలుంది. తీర ప్రాంత రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఈఎన్‌సీ (ఈస్టర్న్ నేవల్ కమాండ్) స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన నౌకలతో పాటు విదేశాల నుంచి కొనుగోలు చేసిన యుద్ధ నౌకలతో ఆయుధ సంపత్తిని పెంచుకుంటోంది. ఇప్పటికే యుద్ధ నౌకలు, సబ్ మెరైన్ల స్థావరంగా ఉన్న విశాఖ తీరం తాజాగా మరో రెండు ముఖ్యమైన రక్షణ వ్యవస్థలకు కేంద్రంగా మారుతోంది. దేశంలోనే తొలిసారిగా భారీ టార్పెడోలు, అండర్ వాటర్ వెపన్స్ పరీక్ష కేంద్రాన్ని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) నిర్మించనుంది. భీమిలిలో అన్ని రకాల క్షిపణులు, రాకెట్లను పరీక్షించే కేంద్రం ఏర్పాటుకు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా ఇటీవల శంకుస్థాపన చేశారు. గత జూలైలో గుజరాత్ తీరంలోని భారత సముద్ర జలాల పరిధిలోకి పాకిస్థాన్‌కు చెందిన యుద్ధనౌక (పీఎన్ఎస్ అలంగీర్) చొచ్చుకురావడం తీవ్ర చర్చనీయాంశమైంది. మన నౌకాదళాలు వెంటనే గుర్తించడంతో పాకిస్థాన్ పాచికలు పారలేదు. మహారాష్ట్ర తీర ప్రాంతంలో కూడా ఓ విదేశీ చిన్న పడవ ఆయుధాలతో వచ్చింది. అయితే అది ఆస్ట్రేలియన్ దంపతులదని తేలింది. తీర రక్షణ ఎంత కీలకమన్న విషయాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తూర్పు నౌకాదళ కేంద్రంగా ఉన్న విశాఖ తీరంలో ఎన్విరాన్‌మెంటల్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు బాధ్యతను ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా బీడీఎల్‌కు అప్పగించారు. ఇప్పటికే టార్పెడోలు, అండర్ వాటర్ వెపన్స్ తయారీ యూనిట్‌ను భారత్ డైనమిక్స్ విశాఖలోనే ఏర్పాటు చేసింది. అయితే వాటిని పరీక్షించే కేంద్రం లేకపోవడంతో దాన్ని కూడా విశాఖలోనే ఏర్పాటు చేయాలని నౌకాదళం నిర్ణయించింది. దీనిలో భాగంగా 8 మీటర్ల పొడవు, 2 టన్నుల బరువైన భారీ టార్పెడోల్ని సైతం ఈ టెస్టింగ్ సెంటర్‌లో పరీక్షించేలా అత్యాధునిక వైబ్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. థర్మల్ చాంబర్, వాకింగ్ చాంబర్లను ఏర్పాటు చేసి అండర్ వాటర్ వెపన్స్‌నూ అణువణువూ పరీక్షించేలా యూనిట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. వైబ్రేషన్ టెస్ట్‌లతో పాటు పర్యావరణహిత పరీక్షలు కూడా ఇందులో నిర్వహించేలా ఏర్పాటవుతున్న ఈ పరీక్ష కేంద్రం నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో అండర్‌వాటర్ వెపన్స్, టార్పెడోల్ని మిత్ర దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం లభిస్తుంది. క్రమంగా టార్పెడోలతో పాటు ఉపరితలం నుంచి గగన తలానికి ప్రయోగించే క్షిపణులు, యుద్ధ విమానాలతో పాటు గగనతలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే ఆయుధాలు, యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్స్‌నూ ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకుంటుందని ఈ సందర్భంగా నౌకాదళాధికారులు భావిస్తున్నారు. సముద్ర గర్భంలో ఆయుధాలతో పాటు రాకెట్లు, క్షిపణులనూ పరీక్షించేందుకు వీలుగా భీమిలిలో స్టాటిక్ టెస్ట్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతోంది. ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని కన్‌స్ట్రక్షన్ ఆఫ్ నేవల్ ఆర్నమెంట్ టెస్టింగ్ కాంప్లెక్స్(సీఎన్ఏఐ)? ఈస్ట్ కాంప్లెక్స్‌లో దీన్ని నిర్మించేందుకు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా కొద్దిరోజుల కిందట శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4.40 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు. అన్ని రకాల క్షిపణులు, రాకెట్లను పరీక్షించడంతో పాటు వాటి జీవితకాలాన్ని పొడిగించేలా మార్పులు, ఇతర ప్రయోగాలకు వేదికగా భీమిలి మారనుంది.

## భారీగా పత్తిగా సాగు



కర్నూలు, సెప్టెంబర్ 2, పత్తి సాగుకు రైతులు ఏడాది మొగ్గు చూపుతున్నారు. పత్తికి ప్రస్తుతం డిమాండ్ ఉండడంతో ఆశాజనకమైన ధర లభించి లాభాలు వస్తాయని ఆశిస్తున్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పత్తి నిల్వలు నిండుకున్నాయి. కరోనా ప్రభావంతో వివిధ రకాల వస్త్రాలు, మాస్కుల తయారీ అధికం కావడంతో దేశ వ్యాప్తంగా కొన్ని ఏళ్లుగా నిల్వ ఉన్న దాదాపు 20 లక్షల పత్తి బేళ్లు అమ్ముడుపోయాయి. దీంతో, ప్రస్తుతం వస్త్రాల తయారీకి పత్తి కొరత ఏర్పడింది. మార్కెట్లో డిమాండ్ పెరగడంతో పత్తి ధరలు గతేడాది భారీగా పెరిగాయి. ఇదే డిమాండ్ ఈ ఏడాదీ కూడా కొనసాగుతోంది. దీంతో, ఈ ఏడాదీ ఆశాజనకమైన ధరలు వస్తాయని రైతులు భావిస్తున్నారు. గతేడాది పొడుగు పింజి పత్తి క్వింటాలు కనీస మద్దతు ధర రూ.6025 కాగా, రూ.8 వేల నుంచి రూ.11 వేల వరకూ రైతులకు లభించింది. రైతుల నుంచి వ్యాపారుల వద్దకు వెళ్లిన తరువాత రికార్డు స్థాయిలో క్వింటాలు రూ.15 వేల వరకు పలికింది. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్‌లో కనీస ధర రూ.8 వేలు తగ్గకుండా గరిష్ట ధర రూ.11 వేల వరకూ లభిస్తోంది. ఆదోని మార్కెట్లో ఏటా ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని మార్కెట్‌ను ఆదోని మార్కెట్ ప్రభావితం చేస్తోంది. గత కొన్ని నెలలు ఇవే ధరలు దేశ వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో గతేడాది పత్తి విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఏటా రాష్ట్రంలో 15.25 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారు. గతేడాది 11.15 లక్షల ఎకరాల్లోనే సాగైంది. గతేడాది ధరలు పెరగడంతో ఈ ఏడాది రైతులు పత్తి సాగు వైపు మళ్లీ దృష్టి సారించారు. సాధారణ విస్తీర్ణం 15.25 లక్షల ఎకరాలుగా కాగా, ఇప్పటికే 14.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగులో ఉంది. మరో లక్ష ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. గతేడాది కన్నా ఈ ఏడాది పైరు కూడా ఆశాజనకంగా ఉంది. ఎకరాకు పది క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గతేడాది పత్తి ధరలు కనీస మద్ధతు ధరకుమించి రావడంతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేసినా, దిగుబడి తగ్గినా రైతులు ఎంతోకొంత లాభపడ్డారు. అంతకుముందు తొమ్మిదేళ్ల కాలంలో ఎప్పుడూ కనీస మద్దతు ధరకు మించి మార్కెట్లో ధరలు లభించలేదు. దీంతో, విసిగిపోయిన రైతులు గతేడాది తక్కువగా సాగు చేశారు. దేశవ్యాప్తంగా వినియోగం పెరగడంతోపాటు దిగుబడులు, విస్తీర్ణం కూడా తగ్గడంతో దేశంలో నిల్వలు లేకుండాపోయాయి. 2022-23 సంవత్సరంలో క్వింటాలు పత్తి కనీస మద్దతు ధర రూ.6,380గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాదీ ధరలు బాగా ఉంటాయని, గతేడాది కన్నా ఏ మాత్రమూ తగ్గవని వ్యాపారులూ చెబుతున్నారు. గుంటూరు కేంద్రంగా దాదాపు వందకుపైగా ఉన్న స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు నిండుకోవడంతో ప్రస్తుతం కార్యకలాపాలు మందగమనంగా సాగుతున్నాయి. మరో రెండు నెలల తరువాత తాజా ఉత్పత్తి మార్కెట్‌లోకి వస్తేనే కార్యకలాపాలు ఊపందుకుంటాయని మిల్లుల యజమానులు చెప్తున్నారు.

## విజయరాయిలో ఘర్షణ

ఏలూరు ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం విజయరాయిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బైక్ ఢీకొన్న ఘటనలో ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్నారు. బాధిత వర్గంలో టీడీపీ కార్యకర్త ఉండడంతో వివాదానికి రాజకీయ రంగు పూసుకుంది. విజయరాయి గ్రామంలో రోడ్డుపై బాధితులు, టిడిపి కార్యకర్తలు బైఠాయించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేసారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘనంగా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేసారు.

## తెలంగాణ ఉద్యమకారునికి సన్మానం

కమాన్ పూర్ తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత రత్న అవార్డు గ్రహీత దేవి లక్ష్మి నరసయ్యకు అభినందనల సన్మానాల పరంపర కొనసాగుతోంది. కన్నాలలో మాల సంఘం సంక్షేమ అధ్యక్షుడు బుట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తన పోలీసు వృత్తిని సైతం త్యాగం చేసి తనకు ఉన్న రెండు ఎకరాల భూమిని కూడా అమ్మి ప్రజా సేవ చేసిన సేవా కార్యక్రమాలు చేసిన గొప్ప వ్యక్తి. దళిత బహు జనుల కోసం పరితపించే నాయకుడు దేవి లక్ష్మి నరసయ్య అని అన్నారు. పేద విద్యార్థిని విద్యార్థులకు చదువుల కోసం ప్రోత్సాహక బహుమతులు యూనిఫామ్ లు మరియు మిగతా బట్టలు కూడా సహాయం చేసిన గొప్ప సేవా తత్పరుడు అని అన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల మాజీ మహిళ ప్రధాన కార్యదర్శి ఎం వనిత కనక రాజ్ కాసర్ల ఆదిత్య అభిజ్ఞ చిట్టి కమల్ ఇంకా తదితరులు పాల్గొన్నారు

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం పై నిషేధాజ్ఞలు కొనసాగింపు

### -అనుమతి లేని డ్రోన్,డిజె సౌండ్స్ పై చర్యలు

మంథని సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని ఇంచార్జ్ రామగుండం పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమినీచినీదని, మద్యం ప్రియులు ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01-09-2022 నుండి 30-09-2022 వరకు కొనసాగుతాయని అన్నారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. ఐపిసి,188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ సిపి హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో డీజే సౌండ్ ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగించమని ఆయన తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. చిన్నపిల్లలు వృద్ధులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్ లతో కూడిన డిజె సౌండ్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధించారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్ల వినియోగిస్తున్నారని అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి ల అనుమతి పొందాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు ఏ స్థాయిలో మైక్ సెట్ లో వినియోగించాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు 01-09-2022 నుండి 30-09-2022 వరకు కొనసాగుతాయని తెలిపారు పరిస్థితుల ప్రభావం ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. ఐపిసి ,188 హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ సిపి హెచ్చరించారు.

## గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

విశాఖపట్నం వినాయక ప్రతిమల నిమ ర్జనాలకు విశాఖ జీవిఎంసీ సరికొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ బెంగళూర్, కలకత్తా మద్రాస్ లాంటి మహానగరాలలో అమలులో ఉన్న తాత్కాలిక వినాయక విగ్రహ కేంద్రాలను జీవీఎంసీ అందుబా టులోకి తీసుకువచ్చింది. ఈ తాత్కా లిక వినాయక నిమజ్జన కేంద్రాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి అక్కడే విగ్రహాల నిమర్జనం చేసేలా జీవిఎంసీ చేసిన ఏర్పాట్లకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. నగర వ్యాప్తంగా 20 కేంద్రాలను జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. కేంద్రాల పనితీరును స్వయంగా జీవీఎంసీ కమిషనర్ పరిశీ లించి నగరవాసుల అభిప్రాయాలను సేకరించారు. జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఈ నూతన పద్ధతి పై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది విరివిగా మరిన్ని కేంద్రా లు అమలులోకి తేవడం ద్వారా ప్రజలకు మరింత సులువు అవుతుం దని అధికారులను కోరారు. ఇప్పటికే స్వచ్ఛభారత్ అమ్మలులో తమ ప్రతిభ కనబరుస్తున్న విశాఖ జీవీఎంసీ ప్లాస్టి క్కు నిషేధించినడం ద్వారా ఆ దేశ ప్రధాని నోటే శభాష్ అనిపించుకున్న అధికారులు పర్యావరణ పరిరక్షణలో మరిన్ని ఉన్నత పద్ధతులను అవలం బించి ఎందుకు ముందుకు సాగుతు న్నారు జీవీఎంసీ అధికారులు.

## మందమర్రి మానో వికాస్ స్కూల్లో వైయస్ వర్ధంతి

మందమర్రి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దుర్గం నాగేష్ నేత ఆదేశాల మేరకు.ఈరోజు మంచిర్యాల జిల్లా, మందమర్రి మానో వికాస్ స్కూల్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరిగింది ముందుగా వైఎస్ రాజశేఖర్ చిత్రపటానికి నివాళులు అర్పించి అనంతరం పిల్లలకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల ప్రభు దేవ్ మాట్లాడుతు.వైయస్ రాజశేఖరరెడ్డి చేసిన సంక్షేమ పథకాలు 108, ఆరోగ్య శ్రీ ,ఇంద్రమ్మ ఇళ్లు, ఫీజు రీయింబర్స్మెంట్, చాలా పథకాలు రాజశేఖర్‌చేశారు.అన్నీ గుర్తుచేసుకున్నారు.అలాగే కెసిఆర్ ప్రభుత్వనీ ప్రజల కష్టాలు తీర్చడంలో విఫలమైంది.రానున్న ఎలక్షన్ లో తెలంగాణలో రాజన్న రాజ్యం కోసం ప్రజలంతా వేచి చూస్తున్నారు.కచ్చితంగా తెలంగాణలో రాజన్న రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేయడం జరిగింది. రాబోయే రోజుల్లో లో తెలంగాణ తొలి మహిళా ముఖ్యమంత్రిగా వైఎస్ షర్మిల రెడ్డి తెలంగాణ ప్రజలను వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలన తలపించేలా పాలన చేస్తారని పూర్తి విశ్వాసం తెలియజేశారు.ఇప్పటికే వైయస్ షర్మిల ప్రజా సమస్యల పట్ల ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. నిరుద్యోగుల కోసం ప్రతి మంగళవారం నిరుద్యోగ నిరసన దీక్షలు చేస్తున్నారు. గిరిజనుల కోసం పోడు భూముల పై పోరు సాగించారు. విస్తృతంగా తెలంగాణ రాష్ట్రమంతా పాదయాత్రగా ప్రయాణించి ప్రజల సమస్యలను లోతుగా తెలుసుకొని వాటి పరిష్కారానికై కృషి చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఒరెం కవి రాజ్, జావిద్ పాషా, చరణ్, వినోద్,సతి,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు మరువలేనివి

### -వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళు లర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

మంథని ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివని మంథని కాంగ్రెస్ శ్రేణులు కొనియాడారు. శుక్రవారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంథని మున్సిపల్ అధ్యక్షులు పోలు శివ అధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 12 వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మంథని మాజీ సర్పంచ్ ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ ఇచ్చి దండుగల మిగిలిన వ్యవసాయన్ని పండుగల చేసి చూపించాడని కొనియాడారు. ఆరోగ్యశ్రీతో సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందించాడన్నారు.ఏఐసీసీ కార్యదర్శి,మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరిక మేరకు ఇందిరమ్మ పేరుతో గూడు లేని పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి, కాళేశ్వరం చిన్న ఎత్తిపోతల పథకం మంథని జేఎన్టీయూ కళాశాల, నిరు పేద విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్మెంటు పథకాన్ని ఏర్పాటు చేసి 108,104 లాంటి అంబులెన్సు ఏర్పాటు చేసి పేదల ముఖాల్లో చిరునవ్వు కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన ఘనత దివంగత నేత డాక్టర్ వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి అని ప్రశంసించారు. రానున్న రోజులలో రాష్ట్రంలో కేంద్రం లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజీమ్ ఖాన్, ఇనుముల సతీష్, గొటికార్ కిషన్ జీ, మంథని సత్యం, పెంద్రు రమ, మూల సరోజన, జంజర్ల శేఖర్, రాం రాజశేఖర్, చొప్పకట్ల హనుమంతు, అబ్దుల్ అలీమ్, మసి రెడ్డి రాజి రెడ్డి, మంథని శ్రీనివాస్, కుదుదల మహదేవ్, కన్నూరి బాపు, గాండ్ల మోహన్, లోక్యా సుధాకర్, దొడ్డ రాజేశ్వరరావు,పెరుగూ తేజ, ఎరుకల రమేష్ బాబు, పొరండ్ల రంజిత్, పెరుగు సతీష్, ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

కమాన్ పూర్ బహుజన సమాజ్ పార్టీ కమాన్ పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టాచ్ దగ్గర తెలంగాణ బిఎస్పి రాష్ట్ర అధ్యక్షుడుడాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు కమాన్పూర్ మండల కేంద్రంలో ఆర్ ఎఫ్ సి ఎల్ బాధితుల న్యాయం చేయాలని మృతుడు ముంజ హరీష్ గౌడ్ 50 లక్షల ఫ్యామిలీకి ఇవ్వాలని అలాగే ఇబ్రహీంపట్నంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికరించి మృతి చెందిన నలుగురు మహిళ లకు బాధ్యత వహిస్తూ డాక్టర్ డాక్టర్ మరియు వైద్య సిబ్బంది సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.

## పవన్ అభిమానుల హల్ చల్

విశాఖపట్నం విశాఖలో పవన్ ఫ్యాన్స్ హల్ చల్ చేశారు.పవన్ మూవీ ప్రత్యేక షోలను ఎంజాయ్ చేస్తూనే నానా హడావుడి చేసి దియేటర్ లో ఫర్నీచర్ ను ద్వంసం చేశారు.జన్మదినం సందర్భంగా పలు అగ్రనేతల మూవీలు రీ రిలీజ్ లతో ధియేటర్లు అభిమానులతో కోలాహలంగా మారాయి.అయితే అభిమానుల అత్యుత్సాహం అదుపు తప్పి సినిమా ధియేటర్ల దాడికి దారి తీస్తోంది.విశాఖ నగరంలో ఓ మూవీ ధియేటర్ లో ఫ్యాన్స్ క్రాకర్స్ కాల్చారు.తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరించారు.దీంతో అభిమానుల తాకితో స్వరూపం కోల్పోతున్న ధియేటర్ల ... వాటి యాజమాన్యానికి ఆస్థ నష్టం తప్పడం లేదు.

# డివైఎఫ్ఐ 15వ రాష్ట్ర మహాసభలకు మోగిన నగారాహాజరైన ప్రముఖులు



కర్నూలు :కర్నూలు నగరంలోని స్థానిక కొండారెడ్డి బురుజు నందు డివైఎఫ్ఐ 15వ రాష్ట్ర మహాసభల నగారా ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నగేష్ అధ్యక్షతన శుక్రవారం డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ శంకర్ శర్మ,రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య,రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.ప్రభాకర్ రెడ్డి నగారా మోగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు.నిరంతరం యువత సమస్యల పైన పోరాడుతున్న భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలు కర్నూలు నగరంలోని మెరీడియన్ ఫంక్షన్ హాల్ నందు సెప్టెంబర్ 17,18,19 తేదీలలో నిర్వహిస్తున్నామని తెలిపారు.కేంద్రంలో ఖాళీగా ఉన్న 33 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని,రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.36 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని,పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరుతూ నిరంతరం ఆందోళనలు,పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం డివైఎఫ్ఐ అని తెలిపారు. పోరాటాలతోపాటు అనేక సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు,యువతను మంచి బాటలో నడిపించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు డివైఎఫ్ఐ నిర్వహిస్తుందని అన్నారు.సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న నరేంద్ర మోడీ ఆయన నిర్ణయాల వల్ల 112509 కంపెనీలు మూతబడి,ఆరు కోట్ల మంది ఉపాధి కోల్పోయారని చెప్పారు. చివరకి అత్యున్నత దేశ భద్రతకు సంబంధించిన ఆర్మీలో కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో నాలుగు సంవత్సరాల కాల పరిమితితో అగ్నిపథ్ పేరుతో ఉద్యోగాలు ఇస్తూ...మొత్తం యువత జీవితాలను నాశనం చేశారని తెలిపారు.రాష్ట్ర మహాసభలలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యూత్ పట్ల వ్యవహరిస్తున్న దుర్మార్గమైన విధానాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తారని తెలిపారు. కావున మహాసభల జయప్రదానికి అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కోశాధికారి రాఘవేంద్ర,డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శిరీష, డివైఎఫ్ఐ న్యూ సిటీ అధ్యక్ష,కార్యదర్శులు వడ్డెమాన్ ధనుష్,హుస్సేన్ భాష,ఓల్డ్ సిటీ అధ్యక్షులు నాయుడు,కర్నూలు మండల కార్యదర్శి ప్రకాష్, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు పి.నిర్మల, ఆహ్వాన సంఘం కార్యదర్శులు గౌస్ దేశాయ్,కె.వి.నారాయణ, రాధాకృష్ణ,రామాంజనేయులు,రాజశేఖర్,రాముడు, నాయకులు విజయ్,షరీఫ్, రామకృష్ణ,అబ్దుల్లా,సాయి బాబా,తదితరులు పాల్గొన్నారు.

## యువశక్తి మిత్రమండలి అన్నదాన కార్యక్రమం

అదొని పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీలో యువశక్తి మిత్రమండలి ఆధ్వర్యంలో 18 వ వార్షికోత్సవ సందర్భంగా వినాయక చవితి సంధర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించామని కమిటీ సభ్యులు తెలియజేశారు,స్వామి వారి పూజలో వందలలో భక్తులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలకు ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తము అలాగే సేవ కార్యక్రమంలో కూడా మా కమిటి సభ్యులు ముందు వుంటున్నారని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో యువశక్తి మిత్రమండలి కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసె శివన్న మిత్ర మండల సభ్యులు రచన గౌడ్.భాస్కర్. నగేష్. భరత్. సంతోష్. అంజు, రామంజి. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



# వైయస్ఆర్ కు ఘన నివాళులు.



వంగత మాజీ ముఖ్యమంత్రి డా.వైయస్ రాజశేఖరరెడ్డి శుక్రవారం 13వ వర్ధంతి సందర్భంగా కర్నూలు నగరంలో వైయస్ఆర్ సిపి శ్రేణులు వారి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు ఘన నివాళులు అర్పించారు.అలాగే పలు సేవలు కార్యక్రమాలు చేపట్టారు.కల్లూరు; 28వ వార్డు పందిపాడులోని వైయస్ఆర్ విగ్రహానికి మేయర్ బి.వై. రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం 200 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.అలాగే 29వ వార్డు శరీన్ నగర్ లోని వైయస్ఆర్ విగ్రహానికి మేయర్, ఎమ్మెల్యే కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో గజమాల వేశారు.కర్నూలు; వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైయస్ఆర్ విగ్రహానికి మేయర్ బి.వై. రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అలాగే ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ సర్కిల్లో ఉన్నా వైయస్ఆర్ విగ్రహానికి వారు పూలమాలలు వేశారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు వైజా అరుణ, సాన శ్రీనువాసులు, రాజేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు ఇప్పాల నారయణ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సత్యనారాయణమ్మ, విక్రమసింహ రెడ్డి, కృష్ణకాంత్ రెడ్డి, శ్రీనివాసరావు (వాసు), చిన్న నర్సింహులు, దండు లక్ష్మీకాంత రెడ్డి, జయరాముడు, వెంకటేశ్వర్లు, లక్ష్మి రెడ్డి, మిద్దె చిట్టెమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు గోపాల్ రెడ్డి, కల్పన గౌరి, ఇలియాస్, తెలుగు అనిల్, పెద్దన్న, మోయిన్, బత్తుల లక్ష్మయ్య, పందిపాడు, అసిఫ్,శివుడు మహిళా నాయకురాలు సుచరిత, విజయలక్ష్మి, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

# జన హృదయ నేత డా" వైఎస్ రాజశేఖర రెడ్డి

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు యం సుధాకర్ బాబు



కర్నూలు : జన హృదయ నేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి గారని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు గారు అభిప్రాయపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రులకే ఆదర్శప్రాయుడని కరుడుగట్టిన కాంగ్రెస్ వాది అని దేశం గర్వించదగ్గ నాయకుడని ఆయన స్వచ్ఛమైన పాలన సాగించారని అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం రాజశేఖర రెడ్డి గారికి పూర్తి స్వేచ్ఛ నిచ్చిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా అమలు చేయని పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు పెంపు, రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ గృహకల్ప, అత్యవసర వైద్యం కోసం 108 , 104 వాహనాలు, రైతులకు ఉచిత విద్యుత్, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోని ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారని సుధాకర్ బాబు గారు పార్టీ కార్యాలయంలో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి 13 వ వర్ధంతి కార్యక్రమంలో కార్యకర్తల సమావేశంలో పై విధంగా ఆయన సేవలను కొనియాడారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది సమావేశంలో వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జాన్ విల్సన్, డిసిసి ఉపాధ్యక్షుడు పెద్దారెడ్డి కోడుమూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి దామోదరం రాధాకృష్ణ పిసిసి అధికార ప్రతినిధి ఎ కరుణాకర్ బాబు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న ఉండవెల్లి వెంకటన్న కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి ఎస్సీ సెల్ చిసత్యరాజు డిసిసి సెక్రటరీ అభినాయుడు, బివి సుబ్రహ్మణ్యం , ఐఎన్టియుసి ప్రధాన కార్యదర్శి ఎం సుంకన్న ఎం సౌల్ రాజు రాజేంద్ర ప్రసాద్ ఖాజాహుసేన్ గోవిందు కేశవరెడ్డి దేవదాసు, మహిళా కాంగ్రెస్ యస్ ప్రమీల కే వెంకటలక్ష్మి ఎల్లమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

## దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 13వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు



ఎమ్మిగనూరు- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మండల ఆఫీస్ నుండి ర్యాలీగా వెలుతు సోమప్ప సర్కిల్ నందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి అనంతరం ర్యాలీ గా వెలుతు వైయస్సార్ సర్కిల్ లో వైయస్సార్ విగ్రహానికి పాలభిషేకం చేసి,గజామాల వేసి అక్కడి నుండి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు, పాలు పంపిణీ చేస్తున్న ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ,ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్. రఘు, వైస్ చైర్మన్ డి.నజీర్ ఆహ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి యూకె.వీరేంద్ర, అధికార ప్రతినిధి కె. సునీల్ కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, కో ఆపరేటివ్ స్టోర్ చైర్మన్ షబ్బీర్ ఆహ్మద్, కౌన్సిలర్లు, ఇన్ చార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 'జోగి' ట్రైలర్ : 1984 సిక్కుల ఊచకోత నేపథ్యంలో..!

అది ఊహకు అందని మారణహోమం.. మూడు రోజుల్లో మూడు వేల మంది సిక్కులను ఊచకోత కోశారు. సరిగ్గా 33 సంవత్సరాల క్రితం దిల్లీ వీధుల్లో దారుణ మారణకాండ ప్రపంచవ్యాప్తంగా సంచలనం అయ్యింది. 1984 అక్టోబర్ 31న భారత ప్రధాని ఇందిరా గాంధీని ఆమె బాడీగార్డులు కాల్చి చంపారు. ఈ వార్త దావానంలా వ్యాపించింది. ఇందిరను చంపిన బాడీగార్డులు సిక్కులని తెలియడంతో ప్రతీకారంగా దిల్లీలోని సిక్కులపై దాడులు ప్రారంభమయ్యాయి. వారి ఆస్తులను తగులబెట్టారు. ఇండ్లను మంటలకు అర్పణం చేశారు. మూడు రోజుల పాటు విధ్వంశ కాండను కొనసాగించారు. ఇందులో ఎందరో అమాయకులు చనిపోయారు. 3000 మందిని ఘోరంగా చంపారు. వేలాదిగా సిక్కులు నిరాశ్రయులయ్యారు.సరిగ్గా మూడు దశాబ్దాల తర్వాత హిస్టరీలో నిక్షిప్తం చేయబడిన ఈ ఘట్టాన్ని ఎంపిక చేసుకుని వెబ్ సిరీస్ ని రూపొందిస్తుండడం దేశవ్యాప్తంగా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.




వెబ్ సిరీస్ కల్చర్ లో ఇలాంటి హిస్టారికల్ ఎమోషనల్ ఘట్టాలను ప్రజలు తిరిగి బుల్లితెరలు ఓటీటీలలో వీక్షించే అవకాశం లభించడం నిజంగా ఒక అదృష్టం అని చెప్పాలి.1984 సిక్కుల ఊచకోత నేపథ్యంలో.. ఎమోషనల్ హత్యాకాండ ఎలా సాగింది? అన్నదానిని నెట్ ఫ్లిక్స్ లో సిరీస్ గా విడుదల చేయనున్నారు. నెట్ఫ్లిక్స్ చిత్రం 'జోగి'లో దిల్జిత్ దోసాంజ్ ప్రధాన పాత్రల నటించారు. కుముద్ మిశ్రా- మొహమ్మద్ జీషన్ అయ్యూబ్- అమైరా దస్తూర్ -హితేన్ తేజ్వానీ కూడా నటించారు. ఈ చిత్రం 2022 సెప్టెంబర్ 16 న విడుదల అవుతుంది. ఈ చిత్రం 1984 నాటి ంబాలను రక్షించుకుంటూ జీవించడానికి ప్రయత్నించే ముగ్గురు స్నేహితుల చుట్టూ ్తకుంది. దిల్జిత్ దోసాంజ్ ఎంతో ఛాలెంజింగ్ పాత్రలో నటించారని అర్థమవుతోంది. నాటి బొంబాయి మత ఘర్షణలు..అల్లర్ల నేపథ్యంలో బొంబాయి లాంటి చారిత్రాత్మక చిత్రాన్ని తెరకెక్కించారు మణిరత్నం. అదే తరహాలో జోగి కట్టిపడేస్తుందని అర్థమవుతోంది.నెట్ ఫ్లిక్స్ 'జోగి' ట్రైలర్ ను షేర్ చేస్తూ నెట్ ఫ్లిక్స్ అధికారిక ఇన్ స్టాగ్రామ్ పేజీ లో వివరాలు వెల్లడించారు "జింకే హౌస్లే బులంద్ హో.. ఉంకీ హిమ్మత్ తోడ్నా నముమ్కిన్ హోతా హై. ఐసా హీ హై సద్దా జోగీ. ఏదిల్జిత్ దోసాంజ్ జోగిని చూడండి .. స్నేహం .. ధైర్యం ఆశ గురించిన కథ. సెప్టెంబర్ 16న నెట్ ఫ్లిక్స్ లో మాత్రమే!" అని వెల్లడించారు.ట్రైలర్ లో 'ఎప్పటికైనా అతిపెద్ద హ్యూమన్ హీస్ట్' సినిమా అంటూ హైలైట్ చేయడం ఆసక్తిని కలిగించింది. జోగి కుటుంబంతో కలిసి అల్పాహారం తీసుకోవడంతో వీడియో మొదలవుతుంది.. ఢిల్లీలో జరిగిన అల్లర్లను ఆవిష్కరించారు. జోగి అతని కుటుంబం ఢిల్లీ నుండి తప్పించుకుని పంజాబ్ కు వెళ్లడానికి ప్రయత్నిస్తారు.. ఎందుకంటే ఇది వారికి సురక్షితమైన ప్రదేశం. జోగి తన ఇద్దరు స్నేహితులతో కలిసి వారి ప్రణాళికను అమలు చేస్తాడు.. అల్లర్ల మధ్య బ్రతకడానికి ప్రయత్నిస్తాడు.నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని తన సిక్కు అంగరక్షకులు హత్య చేయడం 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు ప్రధాన కారణం. ఇది దేశవ్యాప్తంగా వేలాది మంది సిక్కుల దారుణ మరణాలకు దారితీసింది.. ముఖ్యంగా న్యూఢిల్లీలో సిక్కులు అత్యధికంగా ఊచకోతకు గురయ్యారు.

# చిరంజీవి+బాలయ్య స్టెప్పులతో కావాల్సినవాడు!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం మెరుపు వేగం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఓ వేవ్ లా ముందుకు సాగిపోతున్నాడు. 'రాజావారు రాణీవారు'..'ఎస్ ఆర్ కళ్యాణమండపం' సినిమాలతో బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు అందుకుని దూసుకుపోతున్నాడు. మధ్యలో సెబాస్టియన్ కాస్త డిస్టబెన్స్ క్రియేట్ చేసినప్పటికీ ఆ ప్రభావం యంగ్ హీరో పై అంతగా పడలేదు.తనదైన ఛామ్..ఎనర్జీతో టాలీవుడ్ లో ఓ ఐడెంటిటీ ని రెండు సినిమాలతోనే వేయగలిగాడు. ప్రస్తుతం ఈ యంగ్ హీరో లైనప్ కూడా బాగుంది. 'నేను మీకు బాగా కావాల్సిన వాడిని'..'వినరో భాగ్యము విష్ణు కథ' చిత్రాల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రాల నిర్మాణ సంస్థలు అగ్రగామివి కావడంతో యంగ్ హీరోకి అదనపు అడ్వాంటేజ్ గా చెప్పొచ్చు.బిగ్ స్పాన్ లో రిలీజ్ కానున్నాయి. ' నేను మీకు బాగా కావాల్సిన వాడిని' సెప్టెంబర్ 9న రిలీజ్ అవుతోన్న నేపథ్యంలో ప్రచారం




పనులు షురూ అయ్యాయి. ఇప్పటికే విడుదలైన టీజర్.. పాటలకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో మాస్ నెంబర్ విడుదల చేశారు దర్శక నిర్మాతలు."నేను అట్టాంటిట్టాంటి దాన్ని కాదు మావో" అంటూ సాగే లిరికల్ సాంగ్ కి శ్రోతల నుంచి మంచి స్పందన వస్తుంది.పాటలో బాలకృష్ణ నటించిన 'నరసింహనాయుడు' సినిమాలోని 'చిలకపచ్చ కోకసాంగ్.. అలాగే చిరంజీవి నటించిన 'అన్నయ్య' సినిమాలోని 'ఆట కావాలా పాట కావాలా' పాటలకు కూడా కిరణ్ డాన్స్ చేసాడు. సినిమాలో ఈ మాస్ నెంబర్ కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని టీమ్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఆడియోని లహరి ద్వారా మార్కెట్ లోకి తీసుకు వస్తున్నారు.ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా నేను మీకు బాగా కావాల్సినవాడిని సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇందులో సంజన ఆనంద్.. సోనూ ఠాకూర్.. సిద్ధార్థ్ మీనన్.. ఎస్వీ కృష్ణారెడ్డి.. బాబా భాస్కర్.. సమీర్.. సంగీత.. నిహారిక.. ప్రమోదిని..భరత్ రొంగలి నటిస్తున్నారు. దివంగత దర్శకుడు కోడి రామకృష్ణ గారి ప్రథమ కుమార్తె కోడి దివ్య దీప్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# రష్మిక మందన్నకు బాలీవుడ్ లో బిగ్ షాక్!



'ఛలో' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది కన్నడ సోయగం రష్మిక మందన్న. యంగ్ హీరో నాగశౌర్య నటించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మ్యూజికల్ హిట్ గా నిలవడంతో ఇండస్ట్రీలో ప్రతీ ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ఆఫర్లని సొంతం చేసుకుంటూ స్టార్ హీరోయిన్ ల జాబితాలో చేరిపోయింది. విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'గీత గోవిందం' బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచి ఏకంగా రూ. 100 కోట్ల క్లబ్ లో చేరడంతో రష్మిక టాలీవుడ్ లో హాట్ టాపిక గా మారింది.బ్యాక్ టు బ్యాక్ 'గీత గోవిందం' తరువాత స్టార్ హీరోల సరసన నటించే ఛాన్సులు దక్కించుకుంటూ వరుస బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకుంది. ఇటీవల ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో కలిసి నటించిన 'పుష్ప' మూవీ వరల్డ్ వైడ్ గా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది.దీంతో రష్మిక క్రేజ్ మరింత హైట్స్ కి చేరింది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ లో భారీ ఆఫర్లని వరుసగా దక్కించుకుని షాకిచ్చింది. ఇందులో బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ సినిమా కూడా వుండటం విశేషం.సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన 'మిషన్ మజ్ను' మూవీతో బాలీవుడ్ లో తొలి అవకాశాన్ని సొంతం చేసుకున్న రష్మిక ఈ మూవీ రిలీజ్ కాకుండానే మరో మూడు ఆఫర్లని సొంతం చేసుకుంది. అమితాబ్ బచ్చన్ నటిస్తున్న 'గుడ్ బై' రణ్ బీర్ కపూర్ తో 'అర్జున్ రెడ్డి' డైరెక్టర్ సందీప్ వంగ తెరకెక్కిస్తున్న 'యానిమల్' తో పాటు టైగర్ష్రాఫ్ తో కరణ్ జోహార్ నిర్మించనున్న ఓ భారీ ప్రాజెక్ట్ లోనూ నటించబోతోంది. ఇటీవలే టైగర్ష్రాఫ్ తో కలిసి రష్మిక ఓ యాడ్ ఫిల్మ్ లోనూ నటించింది. అయితే ఈ ప్రాజెక్ట్ అర్థాంతరంగా ఆగిపోయిందని తెలిసింది.'స్క్రూడీలా' అనే టైటిల్ తో రూపొందనున్న ఈ మూవీ కోసం హీరో టైగర్ష్రాఫ్ కు కరణ్ జోహార్ పారితోషికం కింద రూ. 35 కోట్లు ఇచ్చారట. అగ్రిమెంట్ కూడా చేసుకున్నారట. అయితే షూటింగ్ మొదలైన తరువాత బాలీవుడ్ లో మారిన సమీకరణాల కారణంగా టైగర్ ష్రాఫ్ ని పారితోషికం తగ్గించుకోమని రూ. 20 కోట్లు పారితోషికం.. వచ్చే లాభాల్లో వాటా తీసుకోమని కోరాడట కరణ్ జోహార్.

# బీచ్‌లో ఎంజాయ్ చేస్తున్న టీమిండియా ఆటగాళ్లు..



వరుస విజయాలతో జోష్‌లో ఉన్న టీమిండియా ఆటగాళ్లు దుబాయ్‌లో మస్తుగా ఎంజాయ్ చేస్తున్నారు. బీచ్ అందాలను ఆస్వాదిస్తూ.. సర్ఫింగ్ చేస్తూ, వాలీబాల్ ఆడుతూ సేదతీరుతున్నారు. ఆదివారం నాటి మ్యాచ్‌కు ముందు లభించిన విరామ సమయాన్ని సరదాగా గడుపుతున్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి సోషల్ మీడియాలో షేర్ చేసింది.ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి సహా మిగిలిన ఆటగాళ్లంతా ఈ బ్రేక్‌ను పూర్తిగా ఆస్వాదిస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్, కేఎల్ రాహుల్ సర్ఫింగ్ చేస్తుండగా.. కోహ్లి.. దినేశ్ కార్తిక్, అశ్విన్, రాహుల్, హార్దిక్ పాండ్యా తదితరులతో బీచ్ వాలీబాల్ ఆడుతూ కనిపించాడు.ఇక

ఆసియా కప్-2022 టోర్నీలో తమ ఆరంభ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను మట్టికరిపించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో హాంగ్ కాంగ్‌పై విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రూప్-ఏలో సూపర్-4కు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. పసికూనతో బుధవారం(ఆగష్టు 31) జరిగిన మ్యాచ్‌లో 40 పరుగుల తేడాతో గెలుపొంది సూపర్ 4లో ఎంట్రీ ఇచ్చింది. ఈ క్రమంలో గ్రూప్- ఏ టాపర్ టీమిండియా ఆదివారం(సెప్టెంబరు 4) ఇదే గ్రూపులోని సెకండ్ టాపర్‌తో తలడనుంది. ఇక హాంగ్ కాంగ్‌తో శుక్రవారం(సెప్టెంబరు 2) నాటి మ్యాచ్‌లో విజయం సాధిస్తే పాకిస్తాన్ మరోసారి టీమిండియాను ఢీకొట్టనుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190